# Sakshi

# టెట్ పరీక్ష కేంద్రాల కేటాయింపులో గందరగోళం

- చెన్నై, బెంగళూరు, హైదరాబాద్ కేంద్రాల కేటాయింపుతో అభ్యర్థుల గగ్గోలు
- పాఠశాల విద్యాశాఖ తీరుపై విమర్శల వెల్లువ

**సాక్షి, అమరావతి:** రాష్ట్రంలో ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్)కు హాజరయ్యే అభ్యర్థులకు పరీక్ష కేంద్రాల కేటాయింపు గందరగోళంగా మారింది. అనేక మందికి చెన్నై, బెంగళూరు, హైదరాబాద్‌ల్లో పరీక్ష కేంద్రాలను కేటాయించడంతో వారంతా గగ్గోలు పెడుతున్నారు. గుంటూరు, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు, చిత్తూరు జిల్లాల్లోని కొందరికి చెన్నైలో పరీక్ష కేంద్రం ఇవ్వగా, అనంతపురం, వైఎస్సార్, తదితర జిల్లాల వారికి బెంగళూరులో పరీక్ష కేంద్రం కేటాయించారు. అలాగే కర్నూలు, మరికొన్ని జిల్లాల వారికి హైదరాబాద్‌లో పరీక్ష కేంద్రం ఇచ్చారు. వీరిలో ఎక్కువమంది మహిళలే ఉండడంతో పాఠశాల విద్యాశాఖ తీరుపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వందల కి.మీ. దూరంలోని పరీక్ష కేంద్రాలు కేటాయిస్తే తాము ఎలా వెళ్లగలుగుతామని, రెండు రోజులు ముందుగా వెళ్లి అక్కడ ఉండి పరీక్ష రాయాలంటే తమకు ఎలా సాధ్యమవుతుందని వారు ప్రశ్నిస్తున్నారు.

**ఆ కేంద్రాలకు ఆప్షన్ ఇవ్వకపోయినా కేటాయింపు**

ఆన్‌లైన్ దరఖాస్తులో ఆప్షన్లలో ఆయా జిల్లాల పరీక్ష కేంద్రాలనే చూపించారు. మధ్యలో చెన్నై, బెంగళూరు, హైదరాబాద్‌లను చేర్చారు. ప్రతి అభ్యర్థి ప్రాధాన్య క్రమంలో ఐదు ఆప్షన్లు ఇస్తే వాటిలో ఏదో ఒకటి కేటాయిస్తారు. ఇలా హైదరాబాద్‌కు 8 వేల మంది, చెన్నై, బెంగళూరుకు 2 వేల చొప్పున ఆప్షన్లు ఇచ్చారు. వీరంతా మొదటిగా తమ సొంత జిల్లాలు, పక్క జిల్లాలు ఇచ్చి చివరి ఆప్షన్‌గా మాత్రమే ఈ కేంద్రాలకు ఆప్షన్ ఇచ్చారు. అయితే వీరిచ్చిన మొదటి ఆప్షన్లు కాకుండా చివరి కేంద్రాలను వీరికి కేటాయించారు. దీంతో వీరంతా ఆందోళన చెందుతున్నారు.

**అంత దూరం ఎలా వెళ్లాలి?**

కడపకు చెందిన ఎస్‌కే సిరాజ్‌కు బెంగళూరు, అనంతపురానికి చెందిన తస్లీమ్‌తాజ్‌కు గుంటూరు, అనంతపురానికి చెందిన కడ్డిపూడి తన్వీరుల్లా, జైద్‌లకు తెలంగాణలోని నల్గొండ జిల్లా పోచంపల్లిని పరీక్ష కేంద్రాలుగా కేటాయించారు. ఎక్కడో దూరంగా, అడ్రస్ కూడా తెలియని పరీక్ష కేంద్రాలకు వ్యయప్రయాసల కోర్చి ఎలా వెళ్లాలని అభ్యర్థులు ప్రశ్నిస్తున్నారు. ఈ పరీక్ష కేంద్రాల కేటాయింపు అస్తవ్యస్తంగా ఉన్నందున వెంటనే వీటిని మార్పు చేయాలని రాష్ట్రోపాధ్యాయ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సీహెచ్ జోసఫ్ సుధీర్‌బాబు, గాజుల నాగేశ్వరరావులు కోరారు. పరీక్ష కేంద్రాల కేటాయింపుపై పాఠశాల విద్యాశాఖ కమిషనర్ సంధ్యారాణితో ప్రస్తావించగా ఆన్‌లైన్ పరీక్ష కావడంతో రాష్ట్రంలోని పరీక్ష కేంద్రాల్లో తగినన్ని సిస్టమ్‌లు లేనందున ఇతర రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు ఇవ్వాల్సి వచ్చిందని తెలిపారు. ఆప్షన్లు ఇవ్వనివారికి కేటాయించారని అడగ్గా అలాంటి వారివి మార్పు చేస్తున్నామన్నారు.

### పరీక్షకు చెన్నై పోవాలంట...



టెట్ పేపర్–2కు దరఖాస్తు చేసుకున్నా. అందులో కడప, అనంతపురం, చిత్తూరు, కర్నూలు, నెల్లూరు కేంద్రాలును ఎంచుకున్నా. అయితే చెన్నైలో పరీక్ష కేంద్రం ఇచ్చారు. చెన్నైలో పరీక్ష కేంద్రం ఎక్కడుందో కూడా తెలియదు. పరీక్ష సెంటర్‌ను అధికారులు మార్చాలి.

–షాషావలి, ఫిజిక్స్ అభ్యర్థి, జమ్మలమడుగు